# 21. ఆరోహణ - అవరోహణ

ఇనుప చక్రాలు పట్టీలమీద మద్దెలలు వాయిస్తున్నాయి. వేగాన్ని పుంజుకుంటూ మంద్ర, మధ్యమ, తారకస్థాయీభేదాలు ప్రకటిస్తున్నాయి, ఇది ఆరోహణ.

మొదటితరగతి కూపేలో ఒక జంట, ఆఫీసరు హరిహరన్- పొరబాటు- హరిహరయ్య- ఆంధ్రుడు, అరవదేశ నివాసి- ఆక్సుఫర్డు పోస్టుగ్రాడ్యుయేట్- అతని భార్య మీనాక్షి- కుంభకోణం తెనుగుబిడ్డ- మెట్రిక్యులేటు.

అతనికి ఆక్సుఫర్డులో అందరికన్న హెచ్చు మార్కులు- ఆమెకు ఇంగ్లీషులో ఒక్క మార్కు తగ్గితే మెట్రిక్యులేషను పరీక్షలో నెగ్గేదే కాదు.

అతను పుచ్చుకున్నది పాతికవేలు కట్నం; రోల్సురాయస్ కారు, మానా మదురైలోని భూములు- మంచి తెలివైన పనిచేశాడు మీనాక్షిని పెళ్ళాడి.

ఆమెకు సర్వత్ర స్వతంత్రం, అతనికి ఏభై శాతం ఆర్థిక స్వాతంత్ర్యం మినహా, మిగిలిన విషయాలలో పూర్ణమైన అధికారం.

ఆంధ్రదేశం సరిహద్దులుదాటి కలకత్తా మెయిలు ఉత్కళదేశం ప్రవేశించింది. రైలు వేగం హెచ్చినట్లు అనిపించింది. రైలు అలిసిపోనిది. ఒకటి రెండుచోట్ల ఆగి తిరిగి పరుగెత్తుతున్నది.

ఆమెకు నిద్రలేదు. పూరీయాత్ర- ఎన్నడూ లేని దైవభక్తి ప్రాణనాధుడికేల కలిగిందని ఆమె శంకించింది. వివాహమయి ఆరువసంతాలు దొర్లిపోయాయి. సంతానం కలుగలేదని గుర్తించాడన్నమాట. లేకపోతే ఈ యాత్రపై మనసేల కలిగింది? తన జాతకంలోకూడా అలాగేవుంది. పెండ్లి అయిన ఆరు సంవత్సరాల తరువాత పుత్ర సంతానమనీ, ఈ ఆలోచనలు గంటలను మింగి వేశాయి.

ఈ ఆలోచనలే ఆమె మనస్సును మధించగా, లేచి మీద బెర్తుమీద పడుకున్న భర్త ముఖాన్ని చుంబించింది మీనాక్షి.

ఈగను తోలినట్లు ఆమెను తోసేసి, అతను తిరిగి స్వప్నలోకం ప్రవేశించాడు. ఆమెకు కోపం రాలేదు. సంతోషం తగ్గనూలేదు.

ఇనుపచక్రాల ధ్వనిలో మార్పు. చక్రాలు అరుస్తున్నాయ్. పీకలు నొక్కిన ప్రాణుల్లా ఆగింది ఇనుప చక్రాల రథం.

నిద్రలోంచి అరుస్తున్నారావాళ్ళు బయట. టీ- "గరమ్ చా" అని? ఆమెచేతి రిస్టువాచీ ఆర్థరాత్రిని సూచించింది.

పై నించి ఎవరో తలుపు తడుతున్నారు. 'కురదారోడ్ ప్లీజ్' అని. నాలుగు సార్లు పిలుపులు. అక్కడదిగి పూరీకి రైలు మారాలని మీనాక్షికి తెలుసు. భర్తను లేపింది. గడియతీసింది. కండక్టరు గార్డు సలాముచేసి, దిగవలసిన చోటు వచ్చిందని చెప్పాడు.

హరిహరయ్య లేచి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళి పెళ్ళికొడుకులా తయారయి వచ్చాడు. పెద్దసూట్‌కేసు. బెడ్డింగు పట్టుకొని కూలివాడు ముందునడిచాడు. మొదటితరగతి విశ్రాంతి మందిరం జనసంకులమై ఉంది. అందులో సగానికిపైగా టిక్కెట్లు లేని రైల్వేవాళ్ళే. ఇదివారి అత్తవారిల్లు.

హరిహరయ్య చిన్న మాస్టరును పిలిచి తానెవరో తెలియజేశాడు. దక్షిణరైల్వేలోని మొదటి తరగతి ఆఫీసరు. తనతోమాట్లాడుతున్నప్పుడు చిన్న మాష్టరు గడగడ వణకలేదు. సర్జిసూట్‌లోంచి గోల్డుఫ్లేకు సిగరెట్టు డబ్బా తీసి ఆఫీసరు కిచ్చాడు. తరువాత అతని నోటిలోని సిగరెట్టుకు అగ్గిపుల్ల వెలిగించి అందిచ్చాడు. ఆఫీసరు థాంక్సు అన్నాడు.

పెద్దమాష్టరు ఆదిశేషయ్య పరుగుపరుగున వచ్చాడు. " తమ టెలిగ్రాం అందించండి. అలారం పదినిమిషాలు ఆలస్యంగా కొట్టిందండీ హరహరియ్యగారూ; వెయిటింగ్ రూమ్ వట్టి ముసాఫిర్‌ఖానా, మాయింట్లో మీకు అన్నీ సమకూర్చాను." అని వినయవిధేయతలు ప్రతీ అచ్చుమీద హల్లుమీద ఉట్టిపడగా అన్నాడు.

ఆఫీసరుగారు మాట్లాడలేదు.

ఆదిశేషయ్య ముందు, హరిహరయ్య వెనుక, మీనాక్షి తరువాత, కూలివాడు ఆఖరున.

ముందు ఇద్దరు ముందయి, వెనుక ఇద్దరు వెనుకయి,

మధ్యదారిలో కాలువ ఎదురయి, అమ్మగారుముందు, ఆమెపైన సామాను.

పైన కూలివాడు పడడం సక్రమంగా జరిగింది.

విధి అనుకూలమైనది. ఎవరికీ దెబ్బలు లేవు. సామానులు పోలేదు. అమ్మగారు సన్నంగా లేక పోవడంనుంచి ఎముకలవరకు దెబ్బ తగలలేదు. ఇంతకూ కాలువ చిన్నది. పడడం పక్కనున్న పచ్చిక మీద, ఉద్యోగనిర్వహణలో కూలివాడు క్షతగాత్రుడు కాలేదు.

ఆదిశేషయ్యగారి యింట్లో , పొరపాటు, ఆగ్నేయ రైల్వేవారి ఇంట్లో ఆగ్నేయ మూలలో గది. గదిలో పందిరిమంచం, టేబులుమీద వెండిచెంబుతో నీరు, గోడకు నిలువుటద్దం, రైల్వేవారి దీపం, డిటోవారి చమురు, వత్తి(ఆనాటికి మెరుపు దీపాలు రాలేదు ఇళ్ళల్లో)

ఆదిశేషయ్య భార్య వెంకమ్మ, మీనాక్షిహరిహరయ్యలు రావడంచేత ఇల్లు పావనమైనదని సంతోషించింది.

ఆమె వెనుక ఆదిశేషయ్య – అక్కయ్య, అంకమ్మ వెనుకకు పోతున్న శ్వేతవస్త్రాన్ని ముందుకులాగి ఆశ్చర్యంతో చూసింది.

తూర్పుగదిలో దూది పరుపుమీద ఆదిశేషయ్య పదమూడేళ్ళ కూతురు వర్ధనమ్మ కలలుగంటూ నిద్రిస్తున్నది.

పడమటి గదిలో పిడకలతీనె పక్క బల్లమంచం, దానిపైన పీచు పరుపు, పురుపుమీద నాగులు గావంచా, దానిమీద ఆదిశేషయ్యకు కాబోయే అల్లుడు శ్రీకారం వేంకటపూర్ణయ్య, ఇరవైఏళ్ళవాడు మశక సుందరీ మధురగాన సుధాస్నాతుడు. మత్కుణ బింబోష్ఠీ చుంబితసకల శరీరుడు. రంభాది అప్సరలు ఈ నిద్రాతపస్వి దీక్షకు భంగం కలుగజేయలేరు.

గడియారం రెండుకొట్టింది. దంపతులిద్దరూ గదిలో మిగిలారు. తలుపులుమూసి ఆవిడ నేలను చాపమీద పడుక్కుంది. అతడు ఆమెను రమ్మనలేదు, నేల పడుకున్నదని విచారించనూలేదు.

ఆమె మనస్సులో రైలుచక్రాల పరుగులు. ఇది తూర్పుగాలి.

అతని మెదడులో రైలుచక్రాల పరుగులు. అది పడమటి గాలి.

## 2

నీలాంబరి రాగంలో "శృంగార లహరి" పాడుతున్నది వర్ధనమ్మ. పైట పరికిణీ, మెడలో కట్టు కాసులపేరు. జడలో సన్నజాజిదండ. నుదుట చిన్న రంగుబొట్టు, చురుకుగా పరిగెత్తే వెలిగోళ్ళ ఎర్రరంగు హార్మోనియమ్ తెల్లమెట్లపై ప్రతిబింబించుతున్నది.

మీనాక్షి స్నానంచేసి, జుట్టు ఆర బెట్టుకుంటున్నది. ఇడ్డెనవంటి గుండ్రనిముఖం, కండ్లు బేడిసమీలవంటివా? కొంచెం చిన్నరకం. వేటని పోలినా మీనాక్షే కదా?

పెద్దగడియారం ఎనిమిదిగంటలు కొట్టింది. అంకమ్మ, "నాయనా, పూర్ణయ్యా! లేవరా!' అని ముద్దుముద్దుగా మూడుసార్లు పిలిచి, ఇటూ అటూ చూసి, నాల్గవసారి శొంఠి పాయసం పెట్టి నిద్రాసతీ చరణ చారణ చక్రవర్తిని మేలుకొలిపింది.

"పెద్దమాస్టారుగారి ఇల్లరికపు అల్లుడివయి, వేటపాడు కరణంగారి ఏకైకపుత్రుడవయి, ఇంట్లో ఆఫీసరులున్నప్పుడు కూడా ఆలస్యంగా లేవడం బాగుందిరా పూర్ణయ్యా" అని పక్క గదిలో మీనాక్షికి వినిపించేటట్లు అంది.

ఇంతలో హరిహరయ్య లేచాడు. దంతధావనాదులు నిర్వర్తించేసరికి తొమ్మిది అయింది. ఆదిశేషయ్యగారు పూరీ వెళ్లేరైలు ఒక్క అర గంటలో బయలుదేరుతుందని అన్నారు.

"ఆదిశేషయ్యగారూ! నాకు ఒకతోడు కావలె గైడ్ అన్నమాట."

"తప్పకుండా! పోర్టర్ వెంకయ్యను పంపేదా?"

"ఛీ! వాళ్ళను ఏమిటండీ! మీరో,మరెవ్వరో మంచివాళ్లు వెళ్ళాళిగాని, అలగాజాతులవాళ్లు పని కొస్తారా" అంది ఆదిశేషయ్య భార్య వెంకమ్మ.

"పూరీలో అటువంటి వర్ణభేదాలు లేవుకదే! అయినా. పెద్దదానివో? చిన్నదానివో చెప్పావు. వినాలి. ఇంకెవరున్నారు?" అని ఆలోచనా సాగర మగ్నుడై నంత... అంకమ్మ అభ్యంతరము నుండి అంకముపైకి అవధరించి, శ్వేతాతపత్రాన్ని కాస్త ఝుళిపించి,

"మీ అల్లుడు వేంకటపూర్ణయ్య లేడురా, పంపరా తమ్ముడూ!" అని అంది.

"పున్నయ్యగాడా! వాడికేం తెలుసే"

"నీ పరువు. ప్రతిష్ఠ నిలబెట్టడని భయమా!" అని అంకమ్మ ప్రశ్న.

ఆదిశేషయ్య నాలుక కరచుకొని, భార్యాముఖదర్పణం విలోకించి, అనుకూలవీచీ ప్రహతుడై, వినయాంజలి ఘటించి, ఆఫీసరుతో విన్న వించాడు.

"హరిహరయ్య గారు! ఈ చిన్న వాడు కాబోయే అల్లుడు. మీకు సాయం వస్తాడు. వ్యవధిలేదు, బయలుదేరండి."

"ఎవరైనా పరవాలేదు. మా మీనాక్షికి తోడుంటే చాలు" అన్నాడు ఆఫీసరు.

పున్నయ్యకీ పరిణామం అనూహ్యమయింది. తొందరగా ఫంట్లాం తొడుక్కొని, చొక్కా వేసుకొని, జుత్తు దువ్వుకొని ఆఫీసరును అనుసరించే వేళకు అంకమ్మ అంగవస్త్రం సంచీలో పెట్టి, అయిదు రూపాయలనోటు చేతిలో పెట్టి. వదినతో అంది "మావాడు ఇవాళ నవమన్మథుడిలా ఉన్నాడు."

"పూరీ హోటలు స్టేషనుకు ఎంత దూరం?" దారిలో ఆఫీసరు అడిగాడు,

"అట్టే దూరంలేదు" అన్నాడు పెద్దమాస్టరు. స్టేషను వాళ్ళు చేరేసరికి రైలు వేచియుంది. మొదటి తరగతి పెట్టెలో - ఆఫీసరు. భార్య బయట తలుపు దగ్గర అల్లుడు, మామ.

"లోన కూర్చోమనండి" అని ఆఫీసరు ఆర్డరు వేశాడు.

మూడవ తరగతి అల్లుడిని మొదతి తరగతి లోనా అని మామ ఆలోచించాడు. మొదటి తరగతి పెట్టెలో కూర్చోడానికి ఆదిశేషయ్య అల్లుడికి హక్కులేదా అని పున్నయ్య అనుకున్నాడు.

"మరేం పరవాలేదు. ఈ పెట్టెలో కూర్చోమనండి" అన్నాడు హరిహరయ్య.

ఆలుమగలు ఒకచోట. కాబోయే ఆలిని వదిలి వచ్చిన మగడు ఎదురుగా - కూర్చున్నారు,

మదరాసునుండి యిద్దరు. ఇప్పుడు ముగ్గురు దో సుఖీ - తీన్?

అయ్యగారు ఆంగ్లపత్రిక తిరగేయడం అమ్మగారు బయటచూడడం - అల్లుడు,(వీళ్ళ అల్లుడు కాడు - మాస్టర్‌గారికి అవుతాడో లేదో) ఏంచేయడానికి తోచక, మొద్దురాచిప్ప వలె వీరిద్దరి ముఖాలు చూడడం- ఇది పెట్టెలో జరుగుతున్నది.

ఇనుపచక్రాలమీద రొద -హెూరున వీచేగాలి-పరుగులెత్తే చెట్లు చేమలు.

ఆమె మనసులో పసిపాపకు మేజోళ్లల్లుచున్నది.

అతని ఆలోచనలో చక్కనిచుక్క నిండిఉన్నది.

అల్లుడికి ఆలోచనలే లేవా? ఉన్నాయి. ప్రొద్దున చద్దన్నం తొందర తొందరగా తినడం నుంచి నీరుల్లిపాయ వేసుకోలేదు- ఆఫీసరుగారితో మాట్లాడితే కంపుకొట్టదూ! పూరీలో వీళ్ళు ఎక్కడదిగుతారు? ప్రసాదం తక్కువగా కొంటే చికాకే. పెద్దింటివాళ్లు, ముద్దు ముద్దుగా భోంచేస్తారుట, అయినా పరవాలేదు. తనదగ్గిర అయిదు రూపాయలనోటు వుందికదా. పకోడీలు కొనుక్కోడానికి డబ్బులివ్వని అమ్మ అయిదురూపాయలు ఎందుకిచ్చింది చెప్మా? ఖర్చుపెట్టమనా? లేక జేబుకి అలంకారమా? ఖర్చు పెడితేనో? ఆఫీసరు వెళ్ళనిచ్చి ఒళ్లు హూనం చేయదు? తనంతటివాడు తాను.ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోతే ఎలా? ఇంతకీ ఈ ప్రయాణ మెందుకొచ్చిందో?

## 3

పూరీహోటలు మేనేజరు ముఖర్జీ ఆఫీసరు హరిహరన్‌ను రిసీవు చేసుకొని, రూమ్ నంబర్ వన్ రిజర్వు చేశానన్నాడు.

పున్నయ్య, మీనాక్షి దూరంలో వరండాపై నిలుచున్నారు,

"మేరి అన్న అమ్మాయి ఏ గదిలోవుంది?" ఆఫీసరు ఆడిగాడు.

"మీ రూమ్ ప్రక్కనే."

"ఆమె ఏమేనా చెప్పిందా?"

"ఇదిగో! ఈ నోటు చదువుకోండి."

హరిహరన్ కవరుచించి ఉత్తరమేదో చదువుకొని జేబులో పెట్టుకున్నాడు. తరువాత భార్య దగ్గరికివచ్చాడు.

"మీనూ! నువ్వు, ఈ అల్లుడూ వెళ్లి దేవుని చూసి ప్రసాదం సేవించి రండి. నేను సముద్ర స్నానం చేసి భోజనంచేసి రెస్టు తీసుకుంటాను."

"మనమిద్దరం కలిసి దేవుడిని చూడాలని కదండి వచ్చింది."

"దేవుడిని చూడడానికి నువ్వు, హోటలులో వుండడానికి నేను."

"నాకీ సంగతి బోధపడదు!"

"నాకు దేవుడిని బలవంతాన తీసుకెళ్ళి చూపించకు, నాకీ నిర్బంధం పనికిరాదు."

"దేవుడి దగ్గరికి రారా?"

"నువ్వు వెళ్ళు."

అతను అన్నది జరిగితారాలి. ఆవిడ అన్నది కూడా జరిగే తీరాలి. దేవునిచూడకపోతే హోటలులో ఉండడానికా ఎనిమిది వందల మైళ్ల ప్రయాణంచేసి వచ్చినది. మగడు రాకపోతే మానె, తాను దేవుడిని చూడక తప్పదు.

"నేను కూడా మీతో సముద్రస్నానానికి వస్తాను."

"నేను లోపలికిపోయి ఈదుతాను."

"నా మానాన నేను ఒడ్డున స్నానం చేస్తాను"

"అయితే నీయిష్టం"

సముద్రం హరిహరన్‌ది కాదు, మీనాక్షి ఎక్కడ స్నానం చేస్తేనేమి.

అతను జోరుగా గదివైపు బయలుదేరాడు. అతని వెంట ఆమె. వరండాలో నిలబడిన అల్లుడికి ఇద్దరి వాలకాలు అర్థంకాక, నున్నటి గచ్చును, తెల్లటి బట్టలు కట్టుకున్న బేరర్లను చూస్తూ కాలం గడిపాడు.

అతను స్విమ్మింగ్ దుస్తులలో, టర్కిష్ తువాలుకప్పుకొని జోరుగా వచ్చాడు. తరువాత మరికొన్ని నిమిషాలలో చిలుకాకుపచ్చరంగుజరీ చీరకట్టుకొని ఆమెవచ్చింది. అతని వెనుక ఆమె, ఆమె వెనుక అల్లుడు.

అల్లుడిదృష్టి ఆమె పాదాలమీద, జంఘల మీద, రంభోరువులమీద, చంచల పృథునితంబాలమీద పడ్డది.

ఆఫీసరు పెళ్లాన్ని ఆ దృష్టితో చూడవచ్చా? తప్పేముంది. స్త్రీ పురుషుల మధ్య పరస్పరమైన ఆకర్షణ లేనినాడు సృష్టేలేదు,

అందని మానిపండ్లకు అర్రులుచాచు తెంపరీ:

ఛీ: అలా నిరాశపడరాదు. మ్రాను వంగును, ఫలాపేక్ష లేని మానవుడెవడు?

మాడవతరగతి అల్లుడికీ ఊహ కలుగునా అని శంక.

నిజానికి అల్లుడిమనసులో ఒక శంక. ఆమె శరీరంచూస్తే మధ్యాహ్నం కొనవలసిన ప్రసాదంతో రూపాయికి అణా వంతయినా తనకు వస్తుందా అని?

ఆమె ఛాయలో నడుస్తున్న అల్లుడు ఆలోచనలో మునిగి, ఆమె ఆగగానే బ్రేకులు పడని సైకిలు వలె ఆమెను డీకొనబోయి అంగుళం మధ్యలో ఆగిన వాడాయెను.

ఎదురుగుండా అలలు విరిగి హోరెత్తే సముద్రం. నీటిలో కొంతమంది స్నానం చేస్తున్నారు. వారిమధ్య నిగనిగలాడే నల్లని శరీరాలు గల జాలరులు.

ఇంగ్లీషు ఛానల్ ఈదిపారేసినమొనగాడు హరిహరన్, అంగలు చాచుకుంటూ ముందుకుపోతున్నాడు. నీరంటే భయపడే మీనాక్షి పాదాలు మునిగే నీటిలో నిలుచుంది.

వచ్చేకెరటానికి, పోయేకెరటానికి ఒదుగుతున్నది. సంచీపట్టుకొని అల్లుడు దూరంపోయి నిలబడ్డాడు.

జాలరులు స్నానం చేయించడానికి వస్తామన్నారు, పొడిపొడి ఇంగ్లీషుముక్కలు కలిసిన ఒరియా భాష వినిపించుకోక, మీనాక్షి భర్తవేపు చూస్తూ నిలుచుంది. జాలరులు ఆమె చంకల్లో చేతులు పెట్టి నీటివైపు లాక్కు పోతున్నారు. ఆఫీసరు పెళ్ళామనే జ్ఞానం అక్కరలేదా?

అల్లుడికి పౌరుషంవచ్చింది. గబగబా గామంచా కట్టుకొని, ఆమెను సమీపించి, "శూద్రాళ్ళు!పొమ్మనండి. నేనుండగా భయంలేదు. స్నానం చేయించేబాధ్యత నాది" అని అన్నాడు. జాలరులు వదలిన చేతులలో తన చేయి చేర్చడానికి వెనుదీశాడు.

నిజపతివైపు దృష్టి జామాతపై మరల్చి,

మధురవాణి పల్కె మందముగను.

"వేంకటపూర్ణయ్యా! దొరగారి వాలకం చూశావోయ్!"

దూరంగా సముద్రంలో ఆఫీసర్ హరిహరన్ - అతనితో ఈదేవారు మరొకరు, తలకు కుళ్లాయి, గుండెలకొాక నీలికబ్బా! అలలు లేనప్పుడు చూస్తే మొలకూడా దిగినట్లు కనిపించని లాగు. మొదట పున్నయ్యకి అనుమానం వేసింది! ఆడా,మగా అని. మగవాడయితే జాకెట్టువంటిది ధరించవలసినద ప్రారబ్దమేమి, తెల్లగా కలువపూవువలె మెరిసే శరీరాన్ని చూసి ఎవరో దొరసాని అని అనుకున్నాడు; ఆ రెండోమనిషి దొరసాని. దొరసానితో ఈదులాడుతున్నాడు ఆఫీసరు.

ఒక పెద్ద అల. అలవారినుంచి వచ్చింది. ముందునున్న మీనాక్షి వెనుకకు పడ్డది. వెనుక నున్న పున్నయ్య ఆమెను పట్టుకోడానికి చేతులు చాచినా ప్రయోజనం లేకపోయింది, ఆమెచీర చెంగు పున్నయ్య ముఖంకప్పింది, ముఖంమీద చీరచెంగు ఆమెవంటిమీదకప్పి. కూకటివేళ్ళు తెగి గాలివానకు నేలవ్రాలిన శాల్మలీవృక్షమువలె కూలిన మీనాక్షిని నిలబెట్టి, పున్నయ్య పురుషుడనిపించుకున్నాడు.

జడకు అంటిన ఇసుక దులుపుకొని, పున్నయ్య భుజంమీద చేయివేసి నించొని, క్షణం అలసట తీర్చుకుని, మీనాక్షి చివాలున గట్టు వేపు తిరిగి. అంది.

"పూర్ణయ్యా, ఈనాటికీ సముద్రస్నానం చాలు. దేవుడిని చూడటానికి వేళవుతున్నది పద"

మీనాక్షి చక్కని ఆకాశపు నీలిరంగు మైసూరు సిల్కుచీర కట్టుకుంది ముఖమలు జాకెట్టు తొడుక్కుడంది. తడిజుత్తుముడి పెట్టుకుంది. నుదుట తిలకం దిద్దుకొంది. ఆమెముఖం తిరుగుతే చెవుల కున్న దుద్దులలోని వజ్రాలు మెరసిపోతున్నవి. ఆమెకట్టిన బట్టలు చూస్తుంటే పున్నయ్యకు ఆశ్చర్యం వేసింది.

"రిక్షాలు తీసుకొని రమ్మన్నారా?" అని అడిగాడు పున్నయ్య.

"రోడ్డుమీదకు పద. అక్కడ చూడొచ్చు"

"దొరగారితో చెప్పి వచ్చేదా?"

"ఏమీ అక్కరలేదు"

వాళ్లు హోటలునుంచి రోడ్డెక్కే సరికి రిక్షాలు కాచుకొని కూర్చున్నాయి.

ఇద్దరు మనుషలకోసం నాలుగు రిక్షాలు వచ్చాయి.

"రెండు చాలు" అన్నాడు అల్లుడు.

రెండు వెళ్ళిపోయాయి.

"ఒకటే కావలసింది" అంది మీనాక్షి, ఒకటి మిగిలింది, పున్నయ్య గుండె పగిలింది, ఆలయం వరకు రిక్షావెనుక పరిగెత్తడమే! ఆమె ఆఫీసరు పెళ్లామయితే?

ఆమె రిక్షాలోపల కూర్చుంది. పున్నయ్య చేతులు కట్టుకుని రిక్షా కదలడంకోసం చూశాడు.

"వచ్చి లోపలకూర్చో! ఇది ఇద్దరు కూర్చోండే రిక్షా! "అంది మీనాక్షి.

ఆఫీసరు పెళ్ళాంపక్క ఆదిశేషయ్య అల్లుడు కూర్చోడమే? నిజమా? ఆమె మాటలను పున్నయ్య సందేహిస్తూ నిలబడ్డాడు.

"రావేం పూర్ణయ్యా? ఆలస్యమవుతున్నది."

వెంటనే వెళ్లి రిక్షాలో కూర్చున్నాడు. సగానికి పైగా ఆమెకూర్చుంది. పూర్ణయ్య ఒదిగి భయం భయంగా కూర్చున్నాడు.

"సరిగా కూర్చో పూర్ణయ్యా" అంది మీనాక్షి కొంచెం జరిగి.

మనసు కలవరపడుతూంటే, కడుపు నకనక లాడుతుంటే పున్నయ్య మాట్లాడకుండా రిక్షాలో కూర్చున్నాడు.

పావుగంటలో రిక్షా ఆలయసమీపానికి చేరుకుంది. రిక్షాలోవాళ్ళు క్రిందకు దిగకుండానే పండాలు వచ్చి పడ్డారు. పూరీలో పండాలబాధ, కోతుల బాధ భరించరానిదన్నారు పూర్వులు, విద్యుచ్ఛక్తి వచ్చిన తరువాత కోతులకు మూడే కాలం వచ్చినా, పండాలకు మాత్రం మోక్షం రాలేదు.

"ఎవడినో ఒకడిని కుదుర్చుకోకపోతే పండాలబాధతప్పదు." అని పున్నయ్య అన్నాడు. తెనుగు మాట్లాడే పండా మిగిలి తక్కినవారు వెళ్లిపోయారు.

పళ్ళు, కొబ్బరికాయలు మీనాక్షి కొంది. పున్నయ్య కొబ్బరికాయ, రెండరిటిపళ్ళు పుచ్చుకుని అర్చకుడి వెనుకపడ్డాడు. పున్నయ్య వెనుక మీనాక్షి, పండా దాటిన వెంటనే

విష్వక్సేనుని వెండిబెత్తపు తోడిమ పున్నయ్య బుర్రమీద రకీమని పడ్డది. ఒకచేతితో బుర్ర తడుముకుంటూ దెబ్బకొట్టిన అర్చక మహాశయుని చూస్తుంటే, ఎవడో వచ్చి చేతిలోని కొబ్బరికాయ, అరటిపళ్ళు నలిపి లాగేశాడు. మరోకడు మీనాక్షి చీరపట్టుకుని వెనుకకు లాగాడు.

ఆ జనసమ్మర్దంలో ఇవి సామాన్యం. స్వామిని దర్శించి బయటపడిన తక్షణమే తెలివైన మీనాక్షి ఒక రూపాయి పండా చేతిలో పెట్టి వెంటనే పొమ్మంది.

"తమరు ప్రభువులు, మీ తాంబూలంఖర్చుకు కూడా నా కిచ్చినది సరిపోదు. ఒక బ్రాహ్మణుడికి పూరీలో భోజనానికేనా సరిపడకుండా ఇవ్వడమేమీ ధర్మంకాదు. దంపతులు రాకరాక వస్తారు. అమ్మగారికి తప్పకుండా పుత్రలాభం కలుగుతుంది" అని పండా తీర్థపురాణం ప్రారంభించాడు.

"స్వామీ! తమరు రూపాయలు తాంబూలం సేవిస్తారు, బంగారం భోజనం చేస్తారు. కాని మేము ఈ రెండు చేయలేం. నేను రైల్వేలో పని చేసేవాడితాలూకా, వేషాలు కట్టిపెట్టి వెళ్లు, అర్ధరూపాయి దగ్గిర రూపాయి యిచ్చినందుకు నేను ఆలోచిస్తుంటే చాలదని పురాణం మొదలుపెడతావా?" అని పున్నయ్య గట్టిగా అన్నాడు.

మీనాక్షి ఆశ్చర్యపడింది. పూర్ణయ్య ఇంత మొనగాడా అని.

రైల్వేవారితాలూకా అనగానే పండావెళ్లిపోయాడు. రోజూ వాళ్లూ,వీళ్లూ టిక్కెట్లు లేకుండా కురదానుంచి పూరీవరకూ, పూరీనుండి కురదావరకు అన్ని తరగతులలోనూ, అన్ని బళ్ళలోను ప్రయాణం చేసే ముఖ్యమైన ప్యాసింజరులు కాబట్టి,

గుడి బయటికి రాగానే పండా ప్రసాదం తెచ్చి ఇచ్చాడు. కాని అది చాల తక్కువ . మీకాక్షికి, పున్నయ్యకి ఆకలి బాగా వేస్తున్నది.

"పూర్ణయ్యా! ముందు మనకొక గది చూడు. తరువాత భోజనాన్ని గురించి ఆలోచిద్దాం,' అంది మీనాక్షి.

"హోటలుకు పోవద్దా" అని అడిగాడు పున్నయ్య.

"ఛీ! అక్కడికా? నేను పోను"

"అయితే పదండి. దగ్గిరలోనే సత్రంవుంది. అక్కడ గది దొరుకుతుంది."

సత్రవులో ఒకగది దొరికింది. మీనాక్షి పది రూపాయల నోటు తీసి పున్యయ్యకిచ్చి పూరీలు మొదలయినవి తినడానికి తెమ్మంది.

పున్యయ్య మనస్సు తేలికపడింది. వేగిరంగా తినుబడి సామానులన్నీకొని తీసుకొని వాచ్చాడు. మిగిలినడబ్బు మీనాక్షి కియ్యబోయాడు.

పూర్ణయ్యా ఆ డబ్బు నీదగ్గిర ఉండనీ . రిక్షావాళ్ళకివ్వడానికి పనికొస్తుంది." అంది మీనాక్షి. ఎనిమిదిరూపాయలు రిక్షాల క్రిందే?

మీనాక్షి గది శుభ్రంచేసి, మంచినీళ్ళు చెంబుతో తెచ్చింది. తలుపు చేరవేసి ఇద్దరూ తెచ్చినవి తిన్నారు. వేళ తప్పిపోవడంచేత, ప్రయాణపు బడలికచేత మీనాక్షి సుకుమారంగా తింది. పున్నయ్యకిది ఏమీ లెక్కలోదికాదు. కాబట్టి అతని తిండి ఆకలితోబాటు హెచ్చింది. పున్నయ్య భోజనం దగ్గిర ముఖమాటపడే మనిషికాడు.

పున్నయ్య ముఖంలో సంతృప్తి ప్రకాశించగా, అన్నాడు." కొంచెం సేపు నిద్రపోతాను. భోజనమైన తరువాత నాకిది అలవాటు. నిద్ర తరువాత చాల తేలికగా ఉంటుంది. మరేమి అనుకోకండి."

మీనాక్షి చిరునవ్వు నవ్వి, "పూర్ణయ్యా! నువ్వు రాకపోతే చాల ఇబ్బంది పడేదాన్ని" అని మాత్రం అంది. అది పున్నయ్య నిద్రకి ఆమోదముద్రా?

సంచి తలక్రింద పెట్టుకొని పున్నయ్య నిద్ర పోయాడు. మీనాక్షి గదితలుపు లోన గడియ పెట్టి పున్నయ్యకు కొద్ది యెడంలో పడుక్కొంది.

మీనాక్షి ఆలోచనలకు అంతులేదు, పుణ్యము, పురుషార్థము అన్నారు పెద్దలు. దేవుడిని చూడడంతో పుణ్యము దక్కింది. సరి! మరి పురుషార్థము. తృతీయా పురుషార్థము ముఖ్యమైనది, అదే కావలసినది.

హరిహరయ్యను తలుచుకుంటే ఆమె ఒళ్లు ఝల్లుమంది. అతను తనను డబ్బుకోసం పెళ్ళాడాడు. దొరసాని పిల్లలంటే పడిచస్తాడు. తన అందాని కేమిలోటు? ఏమిచేయడం, సంఘంలో గౌరవం,హోదా కావలిస్తే ఎవడో మంచి ఉద్యోగస్తుడి నీడను పడిఉండవలసిందే.

ఆరుసంవత్సరాలు అతనినే నమ్ముకొని ఉంది, కాని రోజురోజుకి మోజు తగ్గిపోయింది. ఈనాడు పూర్తిగా పోయింది. తాను ఎంత మంచిదైనా, తనెదుటే దొరసానితో ఊదులాటలా? పూరీ తనతో రావడంలో రహస్యం ఇదేనా :

తనకి మనసులో ఒక కోరిక కొత్తగా కలిగింది. ఒడిలో ఒక చంటిపాపను ఆడించాలని ఉంది. డబ్బుకన్న, బిడ్డల మీదే మనసుపోయింది. తన మనస్సునుంచి దూరమౌతున్న హరిహరయ్య స్థానంలో మరొకడికి హృదయంలో చోటిస్తే తప్పా! బాహ్యానికి భర్త హరిహరయ్య. కాని, మరొక ప్రియుడికి హృదయంలో తావులేదా! భర్తకి తనపైన ధ్యాసలేదు. జీవితంలో నూతనత్వంలో ఒక భిన్నరుచి ఉంది.

మీనాక్షి పున్నయ్య ముఖంలోకి చూసింది. కలతలేని నిద్ర. అమాయకమైన ముఖం. ప్రపంచజ్ఞానం అంతగా లేనివాడు.

మీనాక్షి పున్నయ్యను ఆపాదమస్తకం చూసింది.బలమైన మనిషి మంచి యౌవ్వనంలో ఉన్నాడు. అనాఘ్రాతం పుష్పం. ఇది ఆడవారి విషయంలో, మరి పున్నయ్య విషయంలో ఏమనాలి, మీనాక్షికేమీ తోచలేదు. పున్నయ్యకు దగ్గిరగా వచ్చి , పెదవులమీద మెల్లిగా ముద్దు పెట్టుకొని, మీదను చేయివేసుకొని పడుక్కుంది.

## 5

పున్నయ్యకు తెలివి వచ్చింది, అతని ముఖానికి వెచ్చని ఊర్పులు తగులుతున్నాయి. గుండెలమీద మృదువైన హస్తం. కళ్ళు నులుపుకుని తేరిపారచూచాడు. ఆఫీసరు పెళ్ళానికి, తనకు అంగుళమైనా దూరంలేదు.

"పాపం! రాత్రి నిద్రలేదు. అలసిపోయిందీవిడ. పెద్దింటి బిడ్డ. కటికనేలను పడుకుంది.' అని అనుకున్నాడు.

మెల్లగా ఆవిడచేయి తొలగించి. తొలగిపోయిన పమిట సరిచేసి, బయటకెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాడు. అప్పటికి కూడా ఆవిడ లేవలేదు.

నిద్రలేచిన తరువాత ఆవిడకు కావలసి వుటుందని రెండు కప్పుల టీ, ఒక మంచిరకం బిస్కత్తుల పోట్లాం కొని తెచ్చాడు.

ఇంతలో ఆవిడ లేచింది. దగ్గరగనే కూర్చున్న పున్నయ్యను. అతని తేటముఖాన్ని చూపి సంతోషించింది. బరువెక్కిన కనురెప్పలు ఎత్తి పున్నయ్య కళ్ళలోకి చూచింది. పున్నయ్యకు కితకితలు పెట్టినట్లయింది.

"పూర్ణయ్యా ఎంతసేపయి లేచావు?"

"అప్పుడే అరగంట అయిందండీ!"

మీనాక్షి రిస్టువాచీ చూసింది, నాలుగు గంటలు.

"మీరు ముఖం కడుక్కొని రండి. మీకోసం వేడి టీ, బిస్కత్తులు తెచ్చాను" అన్నాడు పున్నయ్య.

"నేనంటే నీకంత ప్రేమ. నాకోసం పాపం శ్రమపడుతున్నావ్" అని మీనాక్షి నవ్వుతూ పున్నయ్యబుగ్గమీద చిన్న చిటికె వేసింది. కొత్త పెళ్ళికూతురిలా ముసిముసి నవ్వులతో ముఖం క్రిందకు దింపాడు పున్నయ్య.

మీనాక్షి ముఖంకడుక్కొని వచ్చింది. వచ్చి ఫ్లాస్కులో టీ గ్లాసులోపోసి, నాలుగు బిస్కత్తులు తీసి పున్నయ్యకిచ్చింది. తనో నాలుగు తింది, తరువాత వేళచూసింది. నాలుగున్నర, ఎండమెరుగు బాగా వుంది.

"పూర్ణయ్యా! ప్రొద్దున దొరగారు నేరుగా మనలను ప్లాట్‌ఫారం మీద కలుసుకుంటానన్నారు. రైలు బయలుదేరడానికి రెండుగంటల వ్యవధి ఉంది. ఊరుచూసుకుంటూ స్టేషను చేరుకుందాము" అంది మీనాక్షి.

"అలాగేనండీ! బజారులు చూచుకొని వెళ్ళేసరికి సరిగా రైలు వేళ అవుతుంది" అన్నాడు పున్నయ్య

బజారులో నడిచారు, బొమ్మలు, పటాలు, మీనాక్షి ఒకటి రెండు పటాలు కొంది.

తరువాత పక్కనేవున్న షాపులోకి వెళ్ళి దుకాణంవాడితో ఇంగ్లీషులో మాట్లాడింది. పున్నయ్యకు ఆశ్చర్యంవేసింది, ఆడవాళ్ళు అంత చక్కగా మాట్లాడుతారా అని.

దుకాణంవాడు మంచిరకం సెంటుసీసా, ఇంకా మరేవో సామాన్లు ఇచ్చాడు. ఆమె నూరు రూపాయల నోటు దుకాణంవాడి చేతిలో పెట్టింది వాడు తొమ్మిది పదులు కొంత చిల్లర తిరిగి ఇచ్చాడు,

పున్నయ్య కళ్ళు జిగేలుమన్నవి, అటువంటి పచ్చకాగితాలు ఇంకా మరికొన్ని ఆమె చేతి సంచీలో కనుపించాయి. అబ్బ! ఎంత డబ్బు గలది ఆవిడ.!!

దుకాణం దాటి బయటికి వచ్చారు. రిక్షా ఒకటి వచ్చింది, ఇద్దరూ రిక్షా ఎక్కారు, రిక్షా కదలలేదు, పూవులమ్మే వాడు వచ్చాడు. సన్నజాజిపూలు, మధ్య తెల్ల సంపెంగపూలతో చక్కని సరాలు గ్రుచ్చాడు.

"మీకు పువ్వులంటే ఇష్టమేనా?" అని అడిగాడు పున్నయ్య.

మీనాక్షినవ్వింది. పున్నయ్య జేబులో డబ్బులుతీసి పూలదండ కొన్నాడు.

"తీసుకోండి " అని ఆమె చేతికివ్వబోయాడు.

"ఇంత ప్రేమతో కొన్నవాడివి కాస్త జడలో తురుము" అంది మీనాక్షి.

"నడిబజారులో నాకు సిగ్గువేస్తుందండీ."

"అయితేనాకు పూలువద్దు."

మీనాక్షికి కోపంవచ్చిందనుకున్నాడు పున్యయ్య. గట్టిగిక్కువచ్చింది. పున్నయ్య కేమీ తోచలేదు. రిక్షా పరుగులు తీస్తున్నది.

"మీరు మంచివాళ్ళు. మీకు నామీద కోపమా? అలా అయితే కొంచెం చీకటి పడగానే మీ జడలో తురుముతాను."

మీనాక్షి జవాబు చెప్పలేదు. పున్నయ్యకు తరువాత ఏమి మాట్లాడాలో తోచలేదు.

రిక్షా ఇంద్రద్యుమ్నంచేరుకుంది. కొలనులో దిగి కాళ్ళు కడుక్కొని తిరిగివచ్చారు. ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.

తిరిగి రిక్షాలో కూర్చున్నారు. ఒక మురియఉండలమ్మేవాడు. వాడివెంట ఒక కోతులగుంపు వచ్చింది. వాడు రిక్షా దగ్గరికి వచ్చి నిలుచున్నాడు.

"ఆ గుంపు నీవెనుక ఎందుకుంది?" మీనాక్షి మురియల వాడి నడిగింది.

"యాత్రికులు ఉండలు కొనివేస్తారు, అందుకోసం అవి వెంటబడుతవి"అన్నాడు వాడు.

మీనాక్షి పర్సులో డబ్బులు తీసి ఉండలవాడికిచ్చింది. తరువాత వాడు ఆమెదోసిలిలో కొన్ని ఉండలుంచాడు.

సజ్జలో ఉండలు మీనాక్షిచేతులలో పడడమే తడవు. ఆగుంపు రిక్షాలో వచ్చిపడ్డది. ఒక కోతి మీనాక్షి చేతులు పట్టుకుంది. మరొకటి ఉండలు సంగ్రహించింది. తరువాత కిచకిచ, అన్నీ వెళ్ళిపోయి చెట్టుక్రింద తింటున్నవి.

మీనాక్షికీ అపూర్వసంఘటనతో పంచప్రాణాలుపోయి, ఆరవప్రాణమయిన పున్నయ్యను కౌగిలించుకొంది.

సహసా నఖంపచ..... ఇత్యాది పద్యాలు పున్నయ్య చదువుకున్నాడా? చదువుకుంటే చాలా బాగుండేది. కాని పున్నయ్య కోతులను చూచి దడియలేదు. ఆమె వీపు చరిచి మెల్లగా "మరేం భయంలేదండి, అవి ఏమీ చెయ్యవు ఉండలు తీసుకొని వెళ్ళిపోతాయి" అన్నాడు.

"పూర్ణయ్యా! ముందీసంగతి చెప్పలేక పోయావు?"

"మీకు నామీద కోపం వచ్చింది. చెప్తే ఏమనుకుంటారో అని ఊరుకున్నాను"

"భలేవాడివిలే పూర్ణయ్యా!" అని కౌగిలి విడిచి కూర్చుంది.

రిక్షా స్టేషనువేపు తిరిగింది . అస్తంగతుడాయె వృద్ధభానుడు, చంద్రోదయమా?

తిథి మరిచిపోయాను, చంద్రుడు వచ్చినా రిక్షా వెనుకనుంచి వస్తాడు, చదివేవారికి సందేహం వస్తుందేమో, స్టేషను దేవాలయానికి తూర్పునా, పడమరనా అని. ఇంతెందుకు. కవి సృష్టికర్త (అబద్ధాలు వ్రాయడంలో మొనగాడు), కాబట్టి చీకటి వచ్చింది.

మీనాక్షి మాట్లాడలేదు. పున్నయ్య ఒదిగి కూచోలేదు. ఆమె కుడివైపు మెత్తదనం అనుభవిస్తున్నాడు. దూరంగా స్టేషను, పున్నయ్యకు జ్ఞాపకం వచ్చింది. చేతిలోపూలు ఇక పట్టుకుంటే బాగోదు.

" మీరు కాస్త జడ నావేపు తిప్పుతారా?" అడిగాడు పున్నయ్య.

ఆవిడ జవాబు చెప్పలేదు. ఆమె కబరీభరం మాత్రం పక్కకు తిరిగింది.

ఇది మంచి గురుతు. ఆమెకు మనసులో తన పైని కోపంలేదు. పున్నయ్య ఆమె జడలో పూలదండ తురిమాడు. గుప్పుమని వాసన వెదజల్లినట్లయింది.

రిక్షా స్టేషను దగ్గిరకివచ్చి ఆగింది. ఆవిడ డబ్బుతీసి ఇచ్చి ముందు నడిచింది. పున్నయ్య ఆమె వెనుక నడిచాడు, గుండెలమీదనుంచి బరువు దించినట్లయింది, పూవులు ఆమె ఇష్టప్రకారం తురిమాడు, ఇక ఆమె, ఆమెభర్త. తాను రాత్రి భోజనానికి ఇంటికి.

స్టేషనులో హరిహరయ్య ఎదురుచూస్తున్నాడు

"ఏమి ఆలస్యం?" ప్రశ్నించాడు భర్త.

"ఆలస్య మేముంది. దేవుడిని, ఊరుని చూసి వచ్చాను" అంది భార్య.

" రైలువేళ తెలుసా!"

"ఆరున్నర"

"ఇప్పుడెంతయింది"

"ఆరు ఇదవ్వై"

"ఆలస్యంగా బండికి వస్తే ఎలా?"

"ముందు వచ్చి ఇక్కడ చేయవలసినదేముంది.?"

ఆ మాటలను అతను పట్టించుకోలేదు. పున్నయ్యకు మాత్రం ఆశ్చర్యం వేసింది. ఆమె ఎంత బిరుసైన మనిషి!

"ఇంకా ఆలస్య మెందుకు, పద" అన్నాడు ఆఫీసరు.

రైలు అట్టే దూరంలేదు, అల్లుడుమాత్రం అంటీ అంటనట్లు నడుస్తున్నాడు. మూడో క్లాసు ఖాళీగా వుంటుందో లేదో ఆలోచిస్తున్నాడు. ఆఖరి కూపే తలుపు తీసివుంది. ఆవిడ సామాను అందులో వుంది.

ఆవిడ వెళ్ళి ముందు కూర్చుంది.

"మీనూ! నా స్నేహితుడు నాకోసం ఎదురు చూస్తున్నాడు. మళ్ళా కురదాలో కలుస్తా బైబై" అని ఆఫీసరు ముందుకు వెళ్ళిపోయాడు. అతని అర్ధాంగి మాట్లాడలేదు. అల్లుడుకూపే ఎక్కలేదు.

గార్డు ఆకుపచ్చ దీపం చూపించి ఈల కొట్టాడు.

"రావేం పూర్ణయ్యా! లోపలికి!" ఆవిడ గట్టిగా అంది రైలు కదులుతుంటే. ఆ పెట్టి తప్పితే వెనుకమరి పెట్టె లేకపోవడం వల్ల పున్నయ్య పరుగెత్తి రైలు ఎక్కాడు.

"అతను వెళ్ళిపోతే వెళ్లిపోయాడు గాని, నువ్వుకూడా నన్ను వదిలి వెళ్ళిపోతావా, పూర్ణయ్యా?" అని మీనాక్షి జలభరనయనయై పలికింది.

అల్లుడిది గుండా చెరువా?

తరువాత తలుపుమూశాడు అల్లుడు. క్రిందనొక బెర్తు, మీదనొక బెర్తు, ఆవిడ కూర్చున్న దానిమీదకన్నా మీదను హాయిగా ఉంటుందేమో! రిక్షాలో ఆవిడపక్క కూర్చుంటే తప్పులేదు. ఆమె తగిలితే తప్పులేదు. ఆవిడ భయపడి కౌగిలించుకుంటే తప్పులేదు. ఇక్కడ తప్పువచ్చిందే? తప్పెవరికి? ఆవిడకు కాదు తనకి, తనకి తప్పెందుకు? ఆవిడ మొగుడున్నాడనా? ఇక్కడలేదు కదూ!

"పూర్ణయ్యా! ఏమిటి ఆలోచిస్తున్నావు?" అల్లుడులోపలికి చేరిన తరువాత మొదలయిన పావుగంట ఏకాంతాన్ని రద్దుచేసి ఆవిడ పలికింది.

పున్నయ్య చిన్న నవ్వునవ్వి అన్నాడు, " ఏం లేదండి! మీరుకాస్త సాగోరండి! అలసిపోయారు. నేను మీదకు పోతాను."

ఆవిడ వినిపించుకున్నట్లు లేదు. "ఎక్కడ మళ్ళా రైలు ఆగుతుంది?" అని ప్రశ్నించింది.

"సాక్షిగోపాలంలో."

"ఎంతసేపు ప్రయాణం?"

"ఒక గంట."

"అమ్మయ్య!" ఆవిడ నిట్టూర్చి నడుం వాల్చింది. పున్నయ్య కాస్త కిటికీ వేపు జరిగి ఆవిడ కాళ్ళదగ్గిర కూర్చున్నాడు.

"ఇవాళ చాల తల దిమ్ముగా ఉంది" అంది ఆవిడ.

"బాగా అలిసిపోయారు, రాత్రి చాలవరకు నిద్రలేదాయెను. పగలు యాత్ర" అన్నాడు పున్నయ్య.

"పూర్ణయ్యా! ఆ పెద్ద ఫ్లాస్కు చూడు, అందులో కాఫీ ఉంటుంది. కప్పులో పోసి ఇయ్యి."

వినయవిధేయతలుగల పున్నయ్య ఆఫీసరు గారి అర్ధాంగికి కాఫీ కప్పులోపోసి అందించాడు. తరువాత ఆవిడ లేచి కూచుంది. వేడివేడి కాఫీ త్రాగింది. చెమటబొట్లు ముఖంమీద ముత్యాలవలె తోచినవి.

తరువాత ఆమె కప్పు కడగకుండా కాఫీ పోసి పున్నయ్య కిచ్చింది.

పున్నయ్య ఇది గమనించలేదా? గమనించాడు. తెలివి తేటలు లేనివాడుకాడు. ఒకసారి వర్ధనమ్మ త్రాగిన గ్లాసులో నీళ్లుపోసి అంకమ్మ కొడుక్కిచ్చింది. పున్నయ్యకు చాల కోపం వచ్చింది. కాని ఆవిడ పున్నయ్యచెవిలో, "ఒరి వెర్రి నాగన్నా! పెళ్ళాం ఎంగిలి అమృతంతో సమానంరా! అల్లరి పెట్టకు" అని ఉపదేశించింది.అయితే మీనాక్షి తన పెళ్లామా? బాగుంది! ఎవడో అన్నాడు పెళ్ళికొచ్చిన వాళ్ళందరూ నా పెళ్లాలే అని. ఈ మాట అంటే ఆఫీసరు పక్కలు విరగ దంతాడు. ఏం చేయడం?

"ఆలోచిస్తున్నావా పూర్ణయ్యా?"

కాఫీ ఆవిడ పట్టుకుందన్న సంగతి మరచిపోయి ఆఫీసరుగురించి ఆలోచిస్తున్న పున్నయ్య నిద్రలోంచి మేల్కొన్న వాడివలె, 'లేదండి!" అని గబగబ కాఫీ త్రాగబోయాడు. వేడికాఫీకి నాలుక చురికింది.

మీనాక్షి నవ్వి, "ఎంగిలి అని ఆలోచిస్తున్నవా" లని అంది.

"లేదండీ" అని మామూలుగా త్రాగటం మొదలుపెట్టాడు. కాఫీ ఏం చెడిపోలేదు. ఆవిడ త్రాగిన కప్పులో పోసినంతమాత్రాన.

ఇనుపచక్రాల రొద. ఆమె మనస్సులో రేగుతున్నది తుఫాను. ఒక్కటే కాంక్ష. పుత్రవతి కావాలి. భర్తపై కక్ష సాధించాలి.

ఒక అరగంట గడిచింది. అవకాశం మించి పోతుందా?

పున్నయ్య చీకటిలోకి చూస్తున్నాడు. ఆమె పున్నయ్యను చూస్తున్నది. చిన్నగాలి దుమారం, తరువాత చినుకులు.

"పూర్ణయ్యా! వర్షం వస్తున్నట్లుంది. తలుపులు వేసీ.

పున్నయ్య రెండువేపుల కిటికీ తలుపులు వేసి యథాస్థానంలో కూర్చున్నాడు. మొద్దులా కూర్చున్నాడు. పైన పంకా తిరుగుతున్నది. ఆమె చేరబడింది విలాసంగా. పయ్యెద లేదు. వక్షస్థలం మీదపడే కాంతి ప్రతిఫలిస్తున్నది. ఈ మనిషి ప్రవరాఖ్యుడా? ఒంటరిగా ఆడది, వయసులో నున్నది. దొరికితే కొబ్బరికాయ ముక్కలా కొరుక్కు తినాలి.

ప్రవరాఖ్యుడు ఇతర స్త్రీల పట్ల విముఖుడు. తన భార్యపట్ల మన్మథుడు. ఈ పూర్ణయ్యకు భార్య అంటే తెలియదే. తనకు అతనికి అంతస్థులో భేదమా ఈ మౌనానికి కారణం? ఈ మనిషి మూర్ఖుడా? పూర్ణయ్య మూర్ఖుడుకాడు. ఆడవాళ్ళకి పువ్వులంటే ఇష్టమని తెలుసు. జడలో తురుమడానికి మొదట సంకోచించినా తరువాత ఆమోదించాడు. గాని స్త్రీ అంటే తెలియనివాడు, ఇతర స్త్రీ మీద లగ్నమయిన మనస్సు గలవాడు కాబోలు. కాబోలేమిటి? వర్ధనమ్మ అంటే ప్రాణమేనా వదిలేస్తాడు.

"పూర్ణయ్యా! ఏమిటి ఆలోచిస్తున్నావు?" పావుగంట నిశ్శబ్దాన్ని మీనాక్షి భగ్నం చేసింది.

"ఏమీ లేదండి" అని నవ్వుతూ అన్నాడు.

"వర్ధనమ్మ గురించి తీయటి కలలు కంటున్నావా?"

పున్నయ్య నవ్వాడు. తన మనస్సులో సంగతి ఈమెకెలా తెలిసింది. ఏమీ తోచకపోతే తను వర్ధనమ్మ గురించి తప్ప మరేమి ఆలోచించడు. మామకు పిల్ల నివ్వడానికి ఇష్టంలేదు. అత్తకు మాత్రం కూతురిమీద అమితమైన ప్రేమ. ఎవరి చేతులలో పడేస్తే పిల్ల ఏమి ఇబ్బంది పడుతుందో అని భయం. అంకమ్మ కోడలిని అడుగు క్రిందను పెట్టనీయకుండా పనిచేయగలదు. ఆస్తి పాస్తి గల పున్నయ్యకు పిల్లనివ్వడంలో వెంకమ్మ వెనుకంజ వేయదు.

పున్నయ్య మీనాక్షివేపు తిరిగి, "మీరు చాలా తెలివైనవాళ్ళు, నా మనస్సు ఎలా కనిపెట్టారు?' అని అడిగాడు.

మీనాక్షి దగ్గిరిగావచ్చి పున్నయ్య కళ్ళలోకి చూస్తూ అంది. "పూర్ణయ్యా! వర్ధనమ్మను ప్రేమిస్తున్నావా?"

ఈ మాట కితకితలు పెట్టినట్లయింది పున్నయ్యకి, సినిమాలలో నాయకుడు నాయికను ప్రేమించినట్లు తన వర్ధనమ్మను ప్రేమిస్తున్నాడు అన్నమాట. ఎన్ని సినీమాలు చూచినా తన కింతవరకూ ఈ ఉద్దేశం స్ఫురించలేదు. వర్ధనమ్మను పెళ్ళాడాలని తప్ప ప్రేమించాలని కూడా తెలియదన్నమాట. ఇంతకీ ప్రేమ అంటే?

మీనాక్షి కళ్ళలో ఏదో ఆకర్షణ. ఆమె చూపులలోంచి చూపులు మరల్చుకోలేకపోతున్నాడు. వర్ధనమ్మను ప్రేమిస్తున్నాను కదా అని సంతోష పరవశుడౌతున్నాడు.

"చాలా అందమైన పిల్ల" అంది మీనాక్షి.

అబ్బ ఈవిడ ఎంత సమయజ్ఞత గలది. అమృతం వంటి మాటలు అంటున్నది.

"నిజంగా నీకు పెళ్ళాడాలనే ఉందా?"అని అడిగింది మీనాక్షి.

పున్నయ్యకు ఏమి జవాబు చెప్పాలో తెలియదు. పాయసం త్రాగుతావా? సువర్ణరేఖ మామిడిపండు తింటావా? అని అడిగినట్లే ఉంది. జవాబు చెప్పలేకపోయాడు. తన పక్షంలో మౌనం పూర్ణాంగీకార సూచకం.

"అయితే పూర్ణయ్యా! మరొక ప్రశ్న వేస్తాను, కోపం రాదు కదా"

'అలా అంటారేమండీ! మీరంటే నాకు ఎంతో గౌరవం. మీలాంటి మంచివాళ్ళు ఎక్కడా ఉండరని అనుకుంటున్నాను. మీరు నన్ను కొట్టినా కోపం రాదు."

"వర్ధనమ్మ నిన్ను ప్రేమిస్తున్నదా?"

ఈ ప్రశ్నకు పున్నయ్య దగ్గిర జవాబు లేదు. వర్ధనమ్మ మనసు కనిపెట్టేటంతవాడా తను. అబ్బో! ఆ పిల్లకు ఎంత టెక్కు! ఎంత వయ్యారం! ప్రేమిస్తున్నాడో లేదో తనకేం తెలుసు? తనంటే కోపం కూడా! అప్పుడప్పుడు తను చేసే పనులను ఎగతాళి చేస్తుంది. తననుంచి దూరంగా ఉంటుంది. తను మనిషికానట్లు చూస్తుంది. ఇటువంటి వర్ధనమ్మ తనను ప్రేమిస్తున్నదని ఎలా చెప్పగలడు.

మీనాక్షికి తెలుసు పున్నయ్య జవాబు చెప్పలేడని, ఆడదాని మనసు ఆడదానికి తెలియడంలో కష్టం లేదు. పున్నయ్య మంచివాడే. అందమైనవాడే, కాని, చురుకుగా కనిపించడు. మనసు మంచిది, అమాయకుడు. వర్ధనమ్మ చలాకీ అయినది. పదిమంది పున్నయ్యలను బుట్టలో పెడుతుంది. అందుచేత పున్నయ్యను నౌకరుకన్న గౌరవంగా చూడదు.

మీనాక్షి క్షణం మౌనంగా ఉంది. పున్నయ్య ముఖంలో సంతోషరేఖలు మాయమౌతున్నవి.

"ఈ ప్రశ్న వేశానని కోపమా?"

"కోపం లేదండీ! మీ ప్రశ్న చాలా మంచిది. ఈ ప్రశ్న గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు." పున్నయ్య కొంచెం సేపుండి మళ్ళా అన్నాడు. "అందరు భార్యలూ భర్తలని ప్రేమిస్తారా!"

మీనాక్షికి నిజంగా ఈ ప్రశ్న గట్టిగా తోచింది. తన భర్తను తాను ప్రేమిస్తున్నదా? ప్రేమించినా లేకపోయినా భర్త కాడా? భర్తను ప్రేమించలేదన్నది రూఢి. ఈ ప్రేమ భార్యాభర్తలలో లోపిస్తుందా? కొందరిలో మాత్రమే.

"కొందరు ప్రేమిస్తారు, కొందరు ప్రేమించరు"

ఈ జవాబు పున్నయ్య ప్రశ్నకు సరియైన సమాధానమీయలేదు.

"మిమ్మల్ని ఒక్కటడుగుతాను, కోపం రాదు కదా!"

"కోపమెందుకు!"

"మీరు హరిహరయ్యగారిని ప్రేమిస్తున్నారా?"

ఇది గడ్డు ప్రశ్న. కాని మీనాక్షి గడుసుది. "ప్రేమించకేం పూర్ణయ్యా" అని మాత్రం అంది పున్నయ్య ముఖం మళ్ళా తేరుకుంది. "అయితే వర్ధనమ్మ కూడా నన్ను ప్రేమిస్తుంది " అన్నాడు.

మీనాక్షి ఈ మాట విని ఆలోచనలో పడ్డది. తనలో ప్రేమ ఈనాటికి నశించింది. అసలు హరిహరయ్యను ప్రేమించిందా? అతడు తనను ప్రేమించాడా? ఆ ఒడ్డుకి, ఈ ఒడ్డు ఒకటే దూరం. డబ్బుకోసం అతడు, గౌరవంకోసం ఆమె పెళ్ళాడారు. ఎవరి స్థానం వాళ్లు కాపాడుకుంటున్నారు. ఇంతవరకూ ఊరుకుంది గాని, ఇప్పుడు కక్ష తీర్చుకోవాలని ఆలోచించింది.

రైలు వేగం తగ్గుతున్నది. చక్రాలకు బ్రేకులకు ఘర్షణ, స్టేషను లైట్లు పరిగెత్తివచ్చి ఆగినవి. కొద్దిసేపటిలో తలుపు తట్టినశబ్దం, మీనాక్షి పైట సర్దుకుని కూర్చుంది. పున్నయ్య తలుపు తీశాడు.

వచ్చినవాడు హరిహరయ్య. రైలు కదిలింది. హరిహరయ్య కూర్చున్నాడు. తీసిన తలుపు అలాగే ఉంది. విశ్రాంతి. ఎవరూ మాట్లాడరు. ఆఫీసరు సిగరెట్టు ముట్టించాడు.

"మీనూ! నువ్వు కురదాలో దిగిపో. ఆదిశేషయ్య స్టేషనుకు వస్తున్నారు. నేను నేరుగా కలకత్తా పోయి రెండు మూడు దినాలలో తిరిగి వస్తాను. తరువాత కలిసి మద్రాసు పోదాం"

మీనాక్షి జవాబివ్వలేదు. ఘాటుగా వాసన. అతని ముఖం పాలినట్లనిపించింది మీనాక్షికి. మదిర, మదిరాక్షీ, శృంగారరసాధిదేవత ఆఫీసరు.

"ఆలోచిస్తున్నావా?" అని అడిగాడు ఆఫీసరు.

"అవును" అంది ఆవిడ.

ఆమె మాటలు అర్థం చేసుకోగలిగాడు భర్త.

"రెండు మూడు రోజులు అతనితోనే గడప వలసివస్తుంది. అక్స్‌ఫర్డులో నాతో చదువుకున్న వాడతను."

"అవును"

"నేను నీకు ఊరు చూపించడం గాని, ఉండడం గాని జరగదు. ఆదిశేషయ్యగారి ఇంట్లో నీకు ఏ విధమైన లోటూ ఉండదు."

"నాకా సంగతి తెలుసు. గాని నేను మీతో కలకత్తా వస్తున్నాను. మా మేనమామ బాలీగంజ్‌లో ఉన్న మాట మరచిపోలేదనుకుంటాను."

"ఓ! ఐసీ! తప్పకుండా రావచ్చు" అన్నాడు. ఆఫీసులో పులివంటి ఆఫీసరు పిల్లివలె

పెళ్ళాం దగ్గిర. మరో సిగరెట్టు ముట్టించాడు.

ఈ మనసులు కలియని మాటలు వింటున్న పున్నయ్యకి మతిపోయినట్లయింది. పెళ్ళయిన తరువాత మొగుడు పెళ్లాం ఇలాగే ఉంటారు కాబోలు. భర్తను ప్రేమిస్తానని అన్న మీనాక్షే ఇలా వుంటే తనను ప్రేమించలేని వర్ధనమ్మ ఎలా ఉంటుందో?

మొగుడి స్నేహితుడెవరో మీనాక్షికి తెలుసు. పున్నయ్య మాత్రం మరెవరో స్నేహితుడని అనుకున్నాడు. ఎవరూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనల్లో వారు మునిగారు.

ఇనుప చక్రాల రొదలో మార్పు. గాలి మెల్లగా తలుపును తోస్తున్నది. తలుపు తెరుచుకుంటున్నది. బరువుకి మూసుకుంటున్నది, మద్దెల మ్రోత తగ్గి ధ్వని ఆగింది.

## 6

స్టేషను మాస్టరు ఆదిశేషయ్య రైలు దగ్గిర నిలబడ్డాడు, ఒక చేతితో టిఫిన్ కారియరు, రెండవ చేతిలో వెండిచెంబుతో నీరు, కొంచెందూరంలో నీలిబట్టలు తొడుక్కున్న పోర్టరు.

హరిహరయ్య క్రిందకు దిగాడు. తరువాత అల్లుడు. మీనాక్షి తలుపు దగ్గిర నిలబడింది. మీనాక్షి ఆదిశేషయ్యకు నమస్కారం చేయడం, ఆయన దీవించడం జరిగాయి.

"దైవదర్శనం బాగా అయిందనుకుంటాను" అన్నాడాయన.

"అవునండీ" అన్నాడు ఆఫీసరు.

మీనాక్షి మాట్లాడలేదు. భర్త కోరిన దైవం దర్శనమిచ్చింది.

"అమ్మాయి దిగిపోతుందన్నారు. పోర్టరు వెంకన్నా! సామాను దింపు!"

వెంకన్న ముందుకు వచ్చాడు.

"లేదండీ! నేను కూడా కలకత్తా వెళ్తున్నాను" అంది మీనాక్షి.

"అరే! మా అమ్మాయి వర్ధనమ్మ మధ్యాహ్నం పెద్దమనిషయింది. మిమ్మల్ని తప్పకుండా ఇక్కడ దింపమని మా ఆవిడ, అక్క అన్నారు".

"మామా! వర్ధనమ్మ పెద్దమనిషయిందా?" అని అల్లుడు శ్రీకారం వేంకటపూర్ణయ్య ఆత్రుతగా ప్రశ్నించాడు.

"నీకు అనవసరమైన ప్రసంగ మెందుకురా! ఊరుకో" అని అల్లుడిని చూచి చీదరించుకుంటూ అన్నాడు మామ.

పున్నయ్యకు చాలా అభిమానం వేసింది. ఎవరూ లేకుండా ఉన్నప్పుడు తనను తన్నినా పరవాలేదు. కాని మర్యాదస్తుల దగ్గిర మాట్లాడం చాలా కష్టంగా ఉంటుంది. పున్నయ్య ముఖం చిన్నబోయింది. ఎంతో సంతోషించడానికి బదులు నిరుత్సాహం పొందాడు. మీనాక్షి పున్నయ్య ముఖంలో కలిగిన మార్పులు గుర్తించింది.

'అమ్మాయికి భోజనం పట్టుకురాలేదే! దిగిపోతుందని మీ ఒక్కరికే తెచ్చాను."

"పరవాలేదండీ నాకు రెస్టారెంటు నుంచి వస్తుంది. ఆర్డరు చేశాను" అన్నాడు ఆఫీసరు. ఇంతలో మొదటి గంట కొట్టారు.

"బాబయ్యగారూ! మాతో పూర్ణయ్య కలకత్తా వస్తాడు. పట్టణం చూడటానికి తోడుగా ఉంటాడు" అంది మీనాక్షి.

"తప్పకుండా పంపండి! నా స్నేహితుడితో నేను తిరిగితే మా మీనాక్షికి సాయం ఉంటాడు" అన్నాడు ఆఫీసరు.

"మామయ్యా! నాకు ఇంటికి పోవాలని ఉంది" అన్నాడు బిక్కమొహం వేసిన పున్నయ్య.

"ఇంటి దగ్గిర నీకేం పనిరా? తినడం నిద్రపోవడం తప్ప, కోరి నిన్ను పిలుస్తుంటే టెక్కుగా ఉందేం, ముందర బండి ఎక్కు. తరువాత మాట్లాడుదు గాని" అన్నాడు అనువుగా దొరికిన అల్లుడిమీద అధికారం చూపుతూ.

పున్నయ్యకిది కష్టమయింది. ఏమీ స్వతంత్రం లేనివాడు. ఇంటిదగ్గిర తల్లీ, బయటమామ, తనమాట పడనీయకుండా చేస్తున్నారు. కోపంగా ఇంటికి పోదామనుకున్నాడు. కాని ఇంటిదగ్గర తల్లి, మామ తిడతారు. మీనాక్షి మనస్సు కష్టపెట్టుకుంది. ఆవిడ వీళ్లందరికన్న నయం. మనసిచ్చి, ఆదరంగా మాట్లాడుతున్నది. పెళ్లయేవరకు వర్ధనమ్మ తనదికాదు, తనకి పెళ్లి ఎప్పుడో?

గార్డు ఛటర్జీ ఆకుపచ్చ దీపం చూపుతూ విజిల్ కొడుతున్నాడు.

ఆఫీసరు నడుస్తూ "ఆదిశేషయ్య గారూ! తిరుగుదలలో దిగుతా. మీనూ భోజనం చేసి నిద్రపో! బడలిపోయావు. ముందు కంపార్ట్‌మెంటులో నా స్నేహితుడున్నాడు కలియాలి" అని వెళ్ళిపోయాడు.

రైలు కదిలింది. అల్లుడికి తోవ ఇచ్చింది మీనాక్షి. ఆదిశేషయ్య చేతిలో టిఫిన్ కారియరు, మరచెంబు అందుకుంది.

"అమ్మాయ్ వచ్చేటప్పుడు తప్పకుండా దిగు" అన్నాడు ఆదిశేషయ్య.

"తప్పకుండా!... మరి సెలవు" అంది మీనాక్షి.

ఇనుపచక్రాల రొద మొదలయింది.

మతిపోయిన వాడివలె పున్నయ్య రైలు పెట్టిలో నిలబడ్డాడు. తలుపులువేసి, గడియలు పెట్టింది మీనాక్షి. తరువాత పున్నయ్య దగ్గిరకు వచ్చి, రెండుచేతులూ అతని భుజాలమీదవేసి, కళ్ళలోకి చూస్తూ "పూర్ణయ్యా! నాతో ప్రయాణం చేయడానికి భయపడుతున్నావా" అని అడిగింది.

"లేదండీ! మీరంటే నాకు భయమెందుకు"

"నిజమేనా?"

"అవునండీ! మీతో మాట్లాడడానికి సరదాగా వుంటుంది."

"అయితే కూర్చో."

ఇద్దరూ బెర్తుమీద కూర్చున్నారు.

"అయితే మరి ముందు నాతో రావడానికి ఎందుకు ఆలోచించావు?" అని ఆవిడ అడిగింది.

"ఆలోచన కేమీ లేదు. వర్ధనమ్మ పెద్దమనిషయిందని... అంతే."

మీనాక్షి నవ్వింది. అమాయకుడు. సందేహం లేదు.

"అందుచేతనే నిన్ను రమ్మన్నది నాతో."

పున్నయ్యకీ మాటలు అర్థం కాలేదు.

"వర్ధనమ్మను పెళ్లాడాలని ఉందా?" ఆవిడ అడిగింది.

"అవునండీ."

"ఇలా వెర్రిగా ప్రవర్తిస్తే వర్ధనమ్మ ఎప్పటికీ నిన్ను పెళ్లాడదు."

'నిజంగానే?'

"అబద్ధమనుకున్నావా?"

"మీ మాటలు తప్పుకావు. మీకు మంచి తెలివితేటలున్నాయి. మరి వర్ధనమ్మ నన్ను పెళ్లాడదనే అంటారా?" అన్నాడు బిక్కమొగం వేసి.

"మరేం భయపడకు."

ఈ అభయ దానానికి పున్నయ్య ముఖం ఆనందంతో నిండింది. ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు. "ఎంత మంచివారండీ మీరు. మీ ఋణం తీర్చుకోలేను."

మీనాక్షి నవ్వింది. కొంచెంసేపు ఉండి ఉంది, "పూర్ణయ్యా! ఆకలి వేస్తున్నది. ఒళ్ళు కడుక్కొని వచ్చిన తరువాత భోజనం చేద్దామా"

"నాకు ఆకలిలేదు. మీరు భోజనం చేయండి"

"వర్ధనమ్మ పెద్దమనిషయిందని ఆకలిపోయిందా!"

"అబ్బ! మీరు నన్ను వేళాకోళం చేయకండి."

"మరి ఆకలి లేకపోవడానికి కారణమేముంది?"

"మరేంలేదు. కారియరులో మీకు సరిపడే భోజనముంది. మీకు కడుపునిండకుండా ఆకలితో ఉండడం నాకిష్టం లేదు."

"అందుకోసమా భయపడుతున్నావు. నీకు పెట్టనిదే నేను తింటానా, పూర్ణయ్యా?" పున్నయ్యకు చాలా సంతోషం వేసింది. ఆవిడకు తన మీద చాలా అభిమానమున్నది.

రైలు వేగం తగ్గింది. రైలు ఆగింది. "భువనేశ్వర్" అని పోర్టరు అరుస్తున్నాడు. మరికొద్దిసేపటిలో తలుపు తడుతూ, "మాడమ్" అని పిలుస్తున్నారు బయటనుండి.

మీనాక్షి తలుపు తెరిచింది.

"మీకు పూరీలు, తీపి సామాను తెచ్చి ఇమ్మని ఫోనులో స్టేషను మాష్టరు ఆదిశేషయ్య గారు చెప్పారు. తీసుకోండి" అన్నాడతడు.

సామాను అందుకుంటూ, "మీరెవరు?" అని మీనాక్షి ప్రశ్నించింది.

"చిన్న మాష్టరు. రామారావుని"

"థాంక్సు! ఆదిశేషయ్యగారికి నా నమస్కారాలని చెప్పండి." రైలు కదిలింది. మొదలయింది చక్రాల రొద.

## 7

"మేరీ... గ్లాసులోపోసి నీ చేతులతో అందిచ్చు",

"పో హరీ! హెచ్చుగా త్రాగకు"

"నువ్వు నేర్పినదేగా ఈ విద్య"

"ఇదొక్కటేనా నేను నేర్పినది?"

"ఈదడం, వెన్నెలరాత్రులలో సముద్రపుటిసుకల్లో ఆడుకోడం, ముద్దుపెట్టుకోవడం, అలలలో ఆలింగనం చేసుకోవడం, ఇటువంటి ప్రేమపాఠాలన్నీ నువ్వు నేర్పినవే కదూ!"

"డియర్? నువ్వు కొంటెవాడివి."

"నీకన్నానా!" ఆఫీసర్ హరిహరన్ మేరీ లాంగ్డెల్‌ని చేతుల్లోకి తీసుకొని హాలీవుడ్ ముద్దు పెట్టుకున్నాడు.

"నన్ను రెండు రోజులై చంపుతున్నావ్"

"సంవత్సరమయి నీరాకను ఎదురు చూస్తున్నాను."

"ఎంత వద్దామన్నా వీలయిందికాదు. హబ్బీ నన్ను వదలడానికి మొగ్గడు."

"ముసిలి ముండాకొడుకు. కాపలా కాసేకుక్క, డబ్బు పెట్టి వదలని కోమటి"

"డియర్! నువ్వూ అలాగే అంటావా! నువ్వు పెళ్ళాడక, హబ్బీని కూడా పెళ్ళాడనియ్యకపోతే ఎలా? జీవితమల్లా షాపులోనే గడపవలసి ఉండును."

"నాకు నీ సంగతి తెలుసు. మన ప్రేమ మాటలు దాటిపోయింది. నువ్వు తప్పుదారి త్రొక్కావు. నేను కూడా, తెలిసినా, ఆలోచించలేదు."

"మాది ప్లేటానిక్ లవ్! హబ్బీకి ఆస్తి విస్తారం. ఎవరయినా తన వాళ్ళనే వాళ్ళుంటే చాలునని, అలంకారానికి పెళ్ళాడాడు. ఎవరో ఒక నీడ వుంటే చాలుననిపించింది."

"ఒక్క విశేషం, నువ్వు నన్ను మరచిపోలేదు."

"నేనొకటి అడుగుతాను, నువ్వు మరచి పోయావా?"

"మరచిపోతే ఇంతదూరం వస్తానా?" అని హరిహరన్ చేతులలోని మేరీని చుంబించాడు, మేరీ లైట్ ఆర్పింది.

"నీ సౌందర్యం దివ్యమైనది" అన్నాడు ఆఫీసరు.

"చీకటిలో నీకు కనిపిస్తున్నానా?" అంటూ దీపం వెలిగించింది మేరి.

సాకాంక్షగా ఆమె శరీరాన్ని చూస్తూ, అన్నాడతడు. "కలువకాడలవంటి చేతులు, పిడికిట ఇమిడే నడుము, పద్మ ముకుళాలు పయోధరాలు, పెదవులు బింబారుణాలు. చెంపలపై గులాబి మెరుగులు, ప్రపంచాన్ని కట్టి నీ పాదాక్రాంతంచేసే కడకంటి చూపులు, నీ సౌందర్యం వర్ణించడంలో నేను ఉన్మత్తుడిని."

"నువ్వు కవివి! నీ పద్యాలు ప్రాణప్రదంగా దాచి చదువుకుంటాను."

"నువ్వు నా కవిత్వానికి రససిద్ధివి"

చెంపలు మెల్లగా తాకుతూ, కళ్ళల్లోకి చూస్తున్న హరిహరయ్య చెవిలో మేరీ మెల్లగా అంది. "డియర్"

హరిహరయ్య మేరీని కౌగలించుకున్నాడు.

"నువ్వే షాంపేనువి. నాకు వేరే మత్తు అక్కరలేదు" అన్నాడు ఆఫీసర్.

"వచ్చేయేడు నీకు వ్రాసినట్లు రెండు నెలలుంటాను, సిమ్లాలో మకాం.

"హబ్బీ ఒప్పుకుంటాడా అని సందేహం."

"వచ్చే భారం నాది."

"ఓ వీనస్! ఈ దీనుడిని మరచిపోకు."

"ఇంకా మూడు రాత్రుళ్ళు, పగళ్ళు ఉన్నవి. వీలయితే కేబిలు పంపిస్తాను, మరొక్క వారం ...చాలా?"

హరిహరయ్య మేరీని మాట్లాడనియ్యలేదు. చక్రాల రొదలో మార్పు... ఆగింది రైలు... అది కటకం,

## 8

పున్నయ్య ఒక్కడూ కూర్చున్నాడు, మీనాక్షి ఒళ్ళు కడుక్కోడానికి వెళ్ళి రాలేదు. కటకం వచ్చింది. బహుశా ఆఫీసరు వస్తాడేమోనని తలుపుతీసి బయటకు చూశాడు. ఒక పదినిమిషాల

తరువాత రైలు కదిలింది. తలుపు తీసి కూర్చున్నాడు. ఆకలి వేస్తున్నది. బాత్‌రూమ్ తలుపు ఊగుతున్నది. బహుశా ఆవిడ తలుపు వేయడం మరచిపోయిందేమో!

ఇంతలో బాత్‌రూము తలుపు తెరుచుకుంది, పున్నయ్యకు మీనాక్షిని చూడాలని ఉన్నా పంచప్రాణాలు బిగపట్టుకుని కిటికీలోంచి చూస్తున్నాడు

"పూర్ణయ్యా".

పున్నయ్య ఆమె వేపు తిరిగి చూచాడు. పూలు జలజల రాలుతున్న పారిజాతపు చెట్టుక్రింద నున్నట్లు పరిమళం అలముకుంది. ఆమె శరీరం మీదనున్న చిన్న చిన్న నీటిబొట్లు తామర పూల మీది ప్రాతః కాలపు హిమబిందువుల వలె ఉన్నవి.

మీనాక్షి ఏమీ గమనించినట్లు లేదు. ఆమె హోల్డాలులోంచి చీరెలు తీస్తోంది. ఒకటి పలుచని తెల్లచీర, రెండవది గులాబిరంగు పట్టుచీర.

"పూర్ణయ్యా! ఏ చీర నచ్చుతావు."

పున్నయ్యకు తోచలేదు. "మీరేమి కట్టుకున్నా అందంగా ఉంటారు" అని అన్నాడు.

" ఈ తెల్లచీరంటే ప్రాణం. పండుగకు మా అమ్మ ఇచ్చింది."

"నాకూ అదే నచ్చిందండి"

ఉల్లిపొరవంటి తెల్లని చీరలో మీనాక్షి శరీరం మిలమిలా మెరసిపోయింది.

"పూర్ణయ్యా! నువ్వు కూడా ఒళ్ళు కడుక్కొని రాకూడదూ! భోజనం చేద్దాం"

"నేనూ అదే అనుకుంటున్నాను." అని తాపీపడ్డ మనస్సు కలవాడై పున్నయ్య అన్నాడు.

"లోపల సబ్బుంది. ఒళ్ళు రుద్దుకో! వీపుతోమడానికి వచ్చేదా?"

"పెద్దింటివాళ్ళు. ఒద్దు."

"స్నేహం దగ్గర పెద్ద, చిన్నా ఏమిటి పూర్ణయ్యా!"

"మీరు చాలా మంచి మనస్సు గలవారు."

మీనాక్షి నవ్వింది. పున్నయ్య ఆమె ముఖంలోకి క్షణం చూచి, పై నున్న సంచీలోని గామంచా భుజంమీద వేసుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. లోపల అద్దం దగ్గిర బల్లమీద టూత్‌పేస్టు, స్నో, పౌడరు, చందనసబ్బు మొదలైన అలంకార సామాగ్రి ఉంది. తలుపు లోపల గడియపెట్టి, గామంచా కట్టుకొని, పంట్లాము చిలకొయ్యకు తగిలించి, తరువాత షవర్‌విప్పి స్నానం చేశాడు, చెమట పట్టిన శరీరానికి స్నానం ఉత్సాహాన్ని, బలాన్ని చేకూర్చింది. తుడుచుకోడానికి మరొకటి లేకపోవడంచేత తడిఒంటిమీద పంట్లాము తొడుక్కొని , గామంచా పిడుచుకున్నాడు. తల బాగా తడిగా ఉంది. శరీరంమీద నీటిబిందువులు పూర్తిగా ఆరలేదు.

పున్నయ్య తలుపు తెరుచుకుని వచ్చేసరికి మీనాక్షి బెర్తుమీద భోజనానికి అన్నీ సర్దుతున్నది.

తడి ఆరని పున్నయ్య ఒంటిని చూచి, అతనితో అంది, "సరిగ్గా తుడుచుకోలేదూ?" అని.

"అదే ఆరిపోతుంది."

మీనాక్షి చూచింది. గామంచా ఒకటే ఉంది, దానితో నీళ్ళు పోసుకున్నాడు. వెంటనే హోల్డాలులోని టర్కిష్ తువ్వాలుతో పున్నయ్య తల తుడిచి, తలకు వాసననూనె రాసి, పన్నెతో దువ్వింది. పున్నయ్య ఏమీ చెప్పడానికి తోచక, ఏదో చెప్పరాని ఆనందం అనుభవించాడు.

"ఎంత చక్కగా ఉన్నావో అద్దంలో చూచుకో!" అంది మీనాక్షి.

"వర్ధనమ్మ మెచ్చుకోని ఈ అందంతో ఏం పని?" అన్నాడు పున్నయ్య.

"ఇలా నువ్వుంటే ఏ ఆడది నిన్ను మెచ్చుకోదు?" అంది మీనాక్షి.

పున్నయ్య ఆవిడ కళ్ళలోకి చూస్తూ, "ఈ శరీరాన్ని అందంగా ఉంచితే, నన్ను ఆడవాళ్ళు మెచ్చుకుంటారని నాకు తోచలేదు. స్త్రీ కోరేది అందమా, అలంకారమా?"

రెండూనూ. నీకుగల అందం అలంకారంతో హెచ్చుతుంది. కాస్త శుభ్రంగా, నాజూకుగా ఉంటే, ఆడది మగాడిని మెచ్చుకుంటుంది."

"నాకు కాస్త గుండె నిబ్బరం కలుగుతున్నది. మీకు అందంగా తోచిననాడు, వర్ధనమ్మకు కూడా ఆ భావం కలిగేటట్టు చేయగలనేమో!"

"నువ్వు వెర్రిబాగుల వాడివనుకున్నాను. మాటకారివేనోయ్ పూర్ణయ్యా" అని అంది మీనాక్షి.

తరువాత ఇద్దరూ భోజనం చేశారు. వెన్న కాచిన నెయ్యి, వేపుడు ముక్కలు, గోగుకూర పచ్చడి, పప్పుపులుసు, తీయటి మజ్జిగ ఇవి ఇంటినుండి. పూరీలు, తీపిసామాను భువనేశ్వరం నుండి, ఏవీ మిగలకుండా తినేశారిద్దరూ మాట్లాడుతూ.

భోజనాల తరువాత మీనాక్షి హోల్డాలు బెర్తు మీద విప్పి, తెల్లని దుప్పటీ పైన పరిచింది. పైని ముఖమల్ తలగడా, మీనాక్షి నడుం వాలిస్తే ఆమె కాళ్ళ దగ్గిర పున్నయ్య కూర్చున్నాడు.

"మీకు నిద్రవస్తున్నదా?" అని అడిగాడు పున్నయ్య.

"లేదు పూర్ణయ్యా! నీకు వస్తున్నదా?"

"లేదండీ."

" నువ్వు ఎంతవరకు చదువుకున్నావ్?"

"స్కూలు ఫైనలు ప్యాసయ్యాను."

"ఉద్యోగం చేయలేదేం?"

"నాకు చేయాలనే ఉంది. మా అమ్మ ఇప్పటినుంచీ వద్దంది."

"ఆస్తి ఉన్నా, ఉద్యోగం చేస్తే లోకంతో సంబంధం ఏర్పడుతుంది. స్వతంత్రమైన భావాలు కలుగుతాయి."

"మా అమ్మ పనికి అడ్డు వస్తుంది."

"ఇలాగే పిల్లల్ని చెడగొడతారు."

"మీమాట నిజం, నామీద నాకే ఒకప్పుడు అసహ్యం వేస్తుంది."

"మరి వర్ధనమ్మకు అసహ్యం వేయడంలో తప్పేముంది!"

పున్నయ్య ఆలోచిస్తూ "అయితే వర్ధనమ్మ పెళ్ళాడుతుందా నన్ను?" అని అడిగాడు.

"ఏదో బలవంతాన పెళ్ళాడిందనుకో. జీవితం సుఖంగా గడుస్తుందని ఏమి నమ్మకం?'

పెళ్ళి ఆడడమే ముఖ్యమనుకుంటున్న పున్నయ్యకి ఈ మాట ఆశ్చర్యం కలిగించింది.

"ఆడదాని మనస్సు కనిపెట్టడం కష్టం!" అన్నాడు పున్నయ్య.

"నిజం. ఆడదానికి మొగుడు పెళ్ళాడడంతో లభిస్తాడు. అతనిమీద ఆమెకు ప్రేమ నిలిచినట్లయితే అదృష్టమే. అలా కాకుండా మొగుడి మీద అసహ్యం కలిగితే మరొకడిని ప్రేమించడానికి ఆలోచించదు."

"మరొకసారి చెప్పండి" అన్నాడు పున్నయ్య.

"ఆడుదానిని పెళ్ళాడినవాడు భర్త. ఆమె మనస్సుకి నచ్చినవాడు ప్రియుడు"

"భర్త ప్రియుడు కాడా?"

"అవవచ్చు. కాకపోవచ్చును."

"ఎలా తెలుస్తుంది?"

"ఆమె భర్తను ప్రేమిస్తే అనురాగంతో అతనితో జీవితం గడుపుతుంది, ఆమెకు భర్తే సమస్తము. అలా కాకుండా భర్త మీద ఆమెకు ద్వేషం కలిగి, ఈర్ష్య కలిగి, మనస్సు మరలిందంటే ఇంకొక ప్రియుడిని వెదుక్కుంటుంది. ఇది సహజం."

"అయితే భర్త మీద ప్రేమలేని వాళ్ళందరూ ప్రియులను వెదుక్కుంటారా?"

"అవకాశం లేనివాళ్ళు, నీతికి కట్టుబడి ఉన్నవాళ్ళు, బాధ భరించి మొగుడితోనే కాపురంచేసి పతివ్రతలని పేరు సంపాదించడానికి ప్రయత్నించుతారు. అవకాశం గలవాళ్ళు, జీవిత సుఖాన్ని అనుభవింపదలచిన వాళ్ళు ప్రియుడి గురించి వెదుక్కుంటారు. ప్రియుడికి ప్రాణం సమర్పించడానికైనా వెనుదీయరు."

పున్నయ్య ఆలోచిస్తున్నాడు. పెళ్ళిమీద కలిగిన మోజు మాయమైనట్టు తోచింది. తల్లి బలవంతాన వర్ధనమ్మ తనను పెళ్ళాడవచ్చు. పెళ్ళి అయిన తరువాత తనను సుఖపెడుతుందని ఏమిటి పూచీ? చలాకీ అయినపిల్ల తనను బుట్టలో వేయడంలో సందేహం లేదు. వివాహం జీవితానికి ఆనందం కలిగించడానికి బదులు దుఃఖాన్ని కలిగిస్తే ఏం ప్రయోజనం!

"పూర్ణయ్యా! ఏమిటాలోచిస్తున్నావు?"

"మీరు చెప్పిన విషయం గురించి."

"అబద్ధంగా కనిపిస్తున్నదా?"

"లేదు. మీ మాటలు నిజమైనవి. నాకు ముందుచూపే గాని వెనుకచూపు లేదు."

"ఇది నీకు తీర్చరాని సమస్య కాదు. వర్ధనమ్మకు ఏ కారణం చేతనైనా నీ మీద ప్రేమ కలిగితే?"

పున్నయ్య మీనాక్షి కళ్ళల్లోకి చూస్తూ దీనంగా అన్నాడు. "ఇది సాధ్యమవుతుందా?"

మీనాక్షి మెల్లగా నవ్వి, పున్నయ్య భుజం తట్టి అంది, "సాధ్యం కాకేమి! నువ్వు మగాడివి. కొంచెం స్వతంత్రంగా ఉండి, శరీరంమీద శ్రద్ధ తీసుకొని, నీటుగా తయారయి మాటలలో కొంచెం ముక్తసరిగా ఉండి, అత్తవారింట్లో బానిసలా మెలగకుండా, నీ వ్యక్తిగౌరవం కాపాడుకుంటే, నీలో ఒక ప్రత్యేకత వస్తుంది. ఈ మార్పు సహజంగా స్త్రీ మనస్సుని ఆకర్షిస్తుంది. మగవాళ్ళలో గౌరవమిస్తుంది."

"మీరు విషయాన్ని చక్కగా విశదీకరించారు."

"నువ్వు కూడా చదువుకున్న వాడివి. ఆస్తి గలవాడివి, నీకేంలోటుంది? బంగారానికి కావలసింది మెరుగొక్కటే"

"నేను బంగారమని మీకెలా తెలుసు?"

ఆమె నవ్వి అంది "నేను గీటురాయిని"

"హరిహరయ్యగారు అదృష్టవంతులు. మిమ్మల్ని పెళ్ళాడి"

మీనాక్షి ముఖంలో విచారం తోచింది. "అతడు అందరిపట్ల బంగారమే గాని, నా విషయంలో ఇత్తడి. ఇత్తడి మెరుగులు రెండు రోజులకన్న హెచ్చు ఉండవు."

"అవును. దొరసానితో ఆయన వాలకమే చెప్తున్నది. మిమ్మల్ని ఒంటరిగా వదలి ఎలా వెళ్ళారా అని అనుకున్నాను. ఆయన ప్రవర్తన నాకు బోధపడింది."

"ఆ దొరసానిని ఇంగ్లండులో తగుల్చుకున్నారు. దాని గురించి వందలకొలది మైళ్ళు ప్రయాణం చేసి వచ్చారు."

"నాలాంటి వాడికే కష్టంగా ఉంది. మీకెలా ఉంటుందో!"

"నా కష్టసుఖాలతో అతనికి ప్రమేయం లేదు"

"మీకు జీవితంలో సుఖం కూడా..."

మధ్యలో మీనాక్షి అంది, "తగ్గదు."

"నాకు బోధపడలేదు"

"పూర్ణయ్యా! నేను పతివ్రతనని చెప్పుకోలేను. నాకింకా ఇరవై రెండేళ్ళు దాటలేదు. జీవితంలో అనుభవించవలసిన ఆనందాన్ని వదిలివేసేటంత ప్రారబ్దం నాకు పట్టలేదు."

"అంటే... మీరు చెప్పిన విషయాలని బట్టి మీకు కూడా ఒక ప్రియుడు... తప్పులేదా ఇలా అంటే..."

"తప్పేం పూర్ణయ్యా! నాకు నిజంగా ఒక ప్రియుడు లభించాడు." పున్నయ్యకు ఈర్ష్య కలిగింది. చేతిలో వున్న అంటు మామిడిపండు మరొకరు తీసుకోబోయినట్లయింది.

"అతడు చాలా అదృష్టవంతుడు" అన్నాడు పున్నయ్య నీళ్ళు నములుతూ. మీనాక్షి నవ్వి, "చాలా అదృష్టవంతుడే అతడు. ఎవరికీ చోటీయని నా హృదయంలో స్థానం దొరకడం అదృష్టం కాదా!"

తనే ఆ స్థానంలో వుంటే!... ఛీ... తప్పు... తప్పేముంది... తాను వర్ధనమ్మను ప్రేమిస్తున్నాడు- గాని తనను వర్ధనమ్మ ప్రేమించడంలో సందేహముంది. ... ఈవిడను తను ప్రేమించడం తప్పా?... ప్రేమంటే ఏమిటి?... ఏదో ఈవిడ దగ్గిర ఒక విధమైన చనువు... కోరికా... అన్నీ కలుగుతున్నాయి. ఈమె యింకెవరినో వెదుక్కుంటే... తనెందుకు!... ఈమె చాలా అనురాగంగా వుంది. అయినా ఆడదాని మనస్సు... దాని లోతు ఎవరు కనిపెట్టగలరు?

పున్నయ్య మీనాక్షి ముఖంలోకి చూచాడు. వికసించిన తెల్ల తామర పువ్వులా వుంది. ఆమె కళ్ళల్లో అనిర్వచనీయమైన మధుర భావన లాస్యం చేస్తున్నది... ఆమె తనదయితే... తనతో చనువుగా మాట్లాడినంత మాత్రాన ఆమెను కోరవచ్చా!

ఈమె శృంగారమూర్తి. శరీర లావణ్యాన్ని తనదగ్గర దాచడానికి ప్రయత్నించలేదు. ఇది బహుశా ఆధునికుల లక్షణమేమో!... ఆమెకు తనమీద దయ ఉండవచ్చు. ప్రేమ ఉందని ఏమి నమ్మకం?

"పూర్ణయ్యా! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఏమీ లేదండి,"

"నిద్ర వస్తున్నదా?"

"లేదండీ. మీకు కోపం రాదుకద నిజం చేప్తే?"

"చెప్పు- వింటాను."

"మీతో మాట్లాడడం, మిమ్మల్ని చూడడం నాకు ఎంతో హాయి నిస్తున్నాయి."

"నేను అందంగా ఉన్నానా పూర్ణయ్యా?"

"మీ అందం శారీరకమే కాదు. మీ మనస్సు కూడా మధురమైనది."

మీనాక్షి నవ్వి అంది "పూర్ణయ్యా! నీకు కవిత్వం కూడా వస్తున్నట్లుందే."

"మిమ్మల్ని చూస్తుంటే కలుగుతున్నది,"

"ఏదో అమాయకుడి వనుకున్నాను. తెలివి తక్కువవాడి వనుకున్నాను."

"నిజంగా తెలివితక్కువ వాడినే. గాని మీ పరిచయంవల్ల నాలో ఈ మార్పు వచ్చిందేమో!'

"ఇది కొత్తగా రాలేదు. నీలో అణగివున్నదీ శక్తి. ఉన్నదని గుర్తించినవాళ్ళు లేరు. అందుచేత ఇన్నాళ్ళు ఇలా ఉన్నావు."

"నన్ను మనిషిని చేసినందుకు ఎంతో కృతజ్ఞుడిని."

మీనాక్షి ఆలోచిస్తున్నది.

పున్నయ్య సంభాషణ సాగించాడు. "మా ఊరిలో దేవాలయముంది. ఆ స్తంభాలమీద శిల్పముంది. ఒక స్తంభంమీద గంధర్వకాంత విగ్రహముంది. ఆ శిల్ప సుందరిని ఎన్నిసార్లో మైమరిచి చూచేవాడిని. ఆమె ఎంత చక్కనిదో తెలుసా? ఆమె ముఖం చంద్రునివలె గుండ్రనిది. అరమోడ్పులు కనురెప్పలు. పూర్ణకుంభాలు పయోధరాలు. లోతయిన బొడ్డు, విశాలమైన జఘనం, వర్తులమైన ఊరువులు. ఆమె చేతిలో వికసించిన పద్మం."

మీనాక్షిని సాకాంక్షగా చూస్తూ పున్నయ్య ఆగిపోయాడు.

"ఆహావేం! పూర్ణయ్యా ఎంత చక్కని వర్ణన." అంది మీనాక్షి.

"ఆ గంధర్వకాంతకు జీవముంటే ఎంత బాగుండునో కదా అని అనుకునేవాడిని. రాతికి జీవం వస్తుందా అని సందేహించేవాడిని. కాని నాకు నేడు సందేహ నివృత్తి కలిగింది. ఆ గంధర్వ కాంత శిలాకృతి విడిచి మనుష్య కాంతగా సాక్షాత్కరించింది."

"ఎవరా సుందరి?"

"చెప్పమన్నారా?"

"చెప్పు"

"మీరు."

మీనాక్షి లేచి కూర్చుని, పున్నయ్య మెడకు చేతులుచుట్టి, కళ్ళలోకి విలాసంగా చూస్తూ, "నేను అంత అందంగా ఉంటానా?" అని అడిగింది.

పూర్ణయ్య మాట్లాడలేదు. ఆమెను చూస్తూ ఊరుకున్నాడు.

"మాట్లాడవేం పూర్ణయ్యా!"

"అందం చూడవలసిందిగాని, మాట్లాడవలసిందా!"

రాత్రి చాలా గడిచింది. పూర్ణయ్యకు తెలివి వచ్చింది. బాహువులలోని మీనాక్షిని గుండెలకు హత్తుకొని ఆమె ముఖంలోకి చూచాడు.

మీనాక్షి కళ్ళు విప్పి పూర్ణయ్యను చూచింది. కలలోంచి మేల్కొంది ఆమె. ఆమె వెర్రిగా చూచింది. చూచి చూచి నవ్వడం మొదలు పెట్టింది. భర్తమీద ప్రతీకారం జరిపినందుకామె విరగబడి నవ్వుతోంది. నవ్విందామె, మళ్ళామళ్ళా నవ్వింది. ఆ నవ్వుతెరల ఉద్ధృతం క్రమేణా తగ్గింది. నవ్వి నవ్వి ఆమె అలసిపోయింది.

ఇనుప చక్రాల రొదలో మార్పు- ఆ మద్దెల మ్రోత తారకంనుండి మధ్యమానికి, తరువాత మంద్ర స్థాయికి దిగింది. రైలెక్కడో ఆగింది.

అది అవరోహణ.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక) ★